బస్సులోని అమ్మాయిలందరూ సడన్‌గా ఖవ్వాలి అందుకున్నారు. వాళ్ళపాటతో బస్సు అదిరిపోసాగింది.

రాంబాబు తలతిప్పి సరోజవంక చూశాడు. ఆమె చిరునవ్వుతో కిటికీలోంచి దూరంగా ఎటో చూస్తుంది. గాలికి చెంపలమీద వెంట్రుకలు అటూ ఇటూ కదులుతున్నాయ్....

ఎంత బావుంది?!!..... అనుకున్నాడు రాంబాబు.

హఠాత్తుగా వెనుకనుండి ఎవరో జుట్టుపీకారు. రాంబాబు ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. ముగ్గురమ్మాయిలు ఏంపట్టనట్టు సీరియస్‌గా ఖావ్వాలి పాడుకుంటున్నారు.

రాంబాబు కిష్టయ్య చెవిలో ఊదాడు.

'మీరుకూడా జడపట్టి లాగండి గురూగారూ....' అన్నాడు వాడు.

'అమ్మో! ఇంకేమైనా ఉందా!' అనుకున్నాడు రాంబాబు.

కాస్సేపయ్యాక మళ్ళీ వెనకనుండి జుట్టుపట్టుకుని లాగారెవరో.

'ఒరేయ్ మళ్ళీ లాగార్రా.....' అన్నాడు కిష్టయ్య తొడమీద గోకుతూ రాంబాబు.

'చెప్పాను కదండీ మీరుకూడా జడ లాగమని.....'

'బావుండదురా..... నువ్వు వాళ్ళకిచెప్పు అలా చేస్తే బావుండదని....'

'మీరే చెప్పకూడదూ?...'

'ఏంటి .... ఏంకావాలి?' అంది సరోజ పక్కకి తిరిగి చూస్తూ.

'మరేమోనండీ వెనుకనుండి మా గురువుగారి జుట్టు లాగుతున్నారు. ఎవరో ....హబ్బా....' అన్నాడు కిష్టయ్య తొడ తడుముకుంటూ.

'ఏంటండీ గురూగారూ అంత గట్టిగా గిల్లేస్తారు?'

'సరోజ వెనక్కి తిరిగింది. 'ఏయ్.... వద్దేపాపం!.....ప్లీజ్......' అంది.

రాంబాబు సరోజవంక కృతజ్ఞతాపూర్వకంగాచూశాడు. సరోజ రాంబాబుకి అభయం ఇస్తున్నట్లు నవ్వింది.

అంతే....వాళ్ళు మళ్ళీ రాంబాబు జోలికి రాలేదు.

బస్సు గండిపేట దగ్గర ఆగింది. బస్సులోంచి అందరూ బిల బిల దిగుతుండగా రాంబాబు ఫోటోలు తీశాడు.

తరువాత మంచి స్థలం ఎన్నుకొని మెత్తని పచ్చికలో దుప్పట్లు పరుచుకొని కూర్చున్నారు.

కాస్సేపు కొందరు టేప్‌రికార్డర్ పెట్టుకుని హిందీ పాటలు విన్నారు.

రాంబాబు ఫోటోలు తీస్తూనే ఉన్నాడు.

మధ్యాహ్నం భోజనం అయిన తరువాత పరుగెత్తి ముట్టుకునే అట, కళ్ళకి గంతలు కట్టుకునే ఆట, కబడ్డీ, ఇలా రకరకాల ఆటలు ఆడారు.

పెళ్ళికాని అమ్మాయిలు లైఫ్‌ని ఎంజాయ్ చేసినట్లు ఎవ్వరూచెయ్యరేమో అనుకున్నాడు రాంబాబు. అతను ఎక్కువ సరోజనే కవర్ చేస్తూ ఫోటోలు తీశాడు. తను అలా చేస్తున్నట్లు అతనికే తెలీదు.

సాయంత్రం నాలుగు ఆ ప్రాంతంలో అందరూ చెరువుగట్టున కూర్చుని కబుర్లు చెప్పుకోసాగారు. వంతులవారీగా జోక్స్ చెప్పుకుని విరగబడినవ్వుతున్నారు.

సరిగ్గా అదే సమయంలో నీళ్ళలో 'దభేల్....' మని ఎవరో పడిన శబ్దం వచ్చింది.

రాంబాబు 'ఎవరు? ఎవరు?' అన్నాడు కంగారుగా.

'సరోజ ....' అంది లక్ష్మి.

రాంబాబు మెదడు మొద్దుబారిపోయింది. తక్షణం తన చేతిలోని కెమేరాని కిష్టయ్యకు అందించి నీళ్ళలోకి ఒక్కదూకు దూకాడు.

ఒడ్డున వున్న అమ్మాయిలు కెవ్వున అరిచారు.

## *ఫ్రేమ్ - 5*

### *గండం గడిచింది*

నిశ్శబ్దం....

గాలి వీచే శబ్దం తప్ప మరే శబ్దమూ వినబడ్డం లేదు.

అందరూ ఆతృతగా గండిపేట చెరువులోకి తొంగి చూస్తున్నారు. నీటి ఉపరితలంమీద ఏమీలేదు.

'మా గురూగారూ నీళ్ళలోపలుండి ఈదుకున్నట్టున్నారు 'నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అన్నాడ కిష్టయ్య.

ఎవ్వరూ మాట్లాడలేదుగానీ కిష్టయ్యను మింగేసేలా కొరకొరా చూశారు.

ఒకటి.... రెండు.... మూడూ....

....పది

పది సెకన్లు అయ్యాయి.

నీళ్ళలోంచి ఒక శరీరం తేలింది.

గండిపేట ప్రదేశం మొత్తం కంపించేలా భయంతో అరిచిన కేక!!

'రక్షించండి..... రక్షించండి.... మునిగిపోతున్నాను......'

ఆ అరిచింది సరోజ కాదు....రాంబాబు.

కిష్టయ్య ఘొల్లుమన్నాడు.

'అయ్యబాబోయ్......మా గురూగారూ మునిగిపోతున్నారు... రక్షించండి బాబోయ్....'

'అలా కావల్సిందే.... అసలు మీ గురూగార్ని నీళ్ళలోకి ఎవరు దూకమన్నారు? ....' విసుక్కుంది లక్ష్మి.

‘అదేంటండీ అలా అంటారు..... మీ ఫ్రెండ్‌ని రక్షించాలనే కదండీ దూకారు....

అయ్‌బాబోయ్ గురూగారూ.....’

రక్షించాలనట!.... హు..... ఆ పేరుచెప్పి నీళ్ళలోదూకి దాన్ని పట్టుకుందామని ....’

లావుపాటి అమ్మాయి కిష్టయ్యా నెత్తిన మొట్టింది.

‘రక్షించండి బాబోయ్.....’ రాంబాబు అలా అరుస్తూనే నీళ్ళలోమునిగి రెండుగుటకలు నీళ్ళుమింగి మళ్ళీ నీళ్ళ పైకి తేలిమళ్ళీ ‘రక్షించండి’ అని చేతులు కొట్టుకుటూ అరిచి ఒక్కసారిగా బుడుంగ్‌మని మునిగిపోయాడు.

కిష్టయ్యా ఏడుపు ఆపి ఆందోళనగా నీళ్ళలోకి చూశాడు, రాంబాబు జాడ తెలీలేదు.ఆరుసెకండ్లు గడిచాయ్. నీళ్ళలోంచి గుడగుడ గుడ... మంటూ బుడగలు రావడం మొదలుబెట్టాయి. కిష్టయ్యా ఘొల్లుమన్నాడు.

సరిగ్గా అదే సమయంలో రాంబాబు మునిగినస్థలానికి కాస్తదూరంలో సరోజ పైకి తేలిది. కిష్టయ్యాఏడుపాపి ఆశ్చర్యంగా ఆమె వంకచూశాడు. ఆమె నిక్షేపంగా ఉంది. కిష్టయ్యా మళ్ళీ ఘొల్లుమన్నాడు.

బాబోయ్ ... రక్షిచాల్సిన అవసరం లేనివాళ్ళని రక్షించ ప్రాణాల్ని బలి తీసుకున్నారా....’

‘ఏమిటి ? ఏమైంది??....’ చెరువులోకి అందరూ కంగారుగా చూస్తుంటే ఏం జరిగిందో అర్థంకాని సరోజ అడిగింది.

‘రాంబాబుగారు చెరువులో పడిపోయారు.....’ స్పాట్ చూపిస్తూ అన్నారు అమ్మాయిలు.

‘పడిపోవడం కాదు.... దూకారు.....’ అన్నాడు కిష్టయ్యా వాళ్ళ తప్పుని దిద్దుతూ.

సరోజ నీళ్ళలో మునిగింది.

అందరూ ఊపిరి బిగపెట్టి చూస్తున్నారు. కొన్ని క్షణాల తర్వాత సరోజ తేలింది జుట్టుపట్టి రాంబాబుని పైకి లాగుతూ....

‘రక్షించండి ... రక్షించండి.....’ నీరసంగా నిద్రలో కలవరిస్తున్నట్టు సగంమూతపడిన కళ్ళతో అన్నాడు రాంబాబు.

కిష్టయ్యా చొక్కా ఎత్తి కళ్ళు తుడుచుకుంటూ సంతోషంగా అరిచాడు. ‘గురూగారూ.... మీకేం భయంలేదు ..... సరోజగారు మిమ్మల్ని రక్షిస్తున్నారు....’

‘మీకేం భయం..... కాళ్ళు నీళ్ళలో బాగా ఆడించండి తేల్తారు.

ఉ.... ఇంకా ఆడించాలి .... అలా .... అలా ... వెరీగుడ్’ అంది సరోజ రాంబాబుతో.

‘నేను కాళ్ళు ఆడిస్తున్నానుగా....మీరిక నాజుట్టు వదిలెయ్యండి......’ అన్నాడు రాంబాబు నీర్సంగా.

‘ఓ అయామ్ సారీ.....’

రాంబాబు జుట్టు వదిలేసి జబ్బ పట్టుకుంది సరోజ.

అయిదు నిమిషాలకి వాళ్ళు ఒడ్డుకు చేరారు.

ఒడ్డుకి చేర్చగానే రాంబాబు మూర్ఛపోయాడు.

'ఎందుకే అలా అందరూ చుట్టూమూగుతారు..... కాస్త దూరంగా జరగండి ..... ఆయనకి గాలి తగలనివ్వండి ....' సరోజ కోప్పడింది.

అందరు అమ్మాయిలూ కాస్తదూరంగా జరిగారు.

సరోజ రాంబాబుచేత మింగిన నీళ్ళన్నీ కక్కించింది.

'నేను కూడా ఆయన పొట్ట నొక్కనా?.....ఇంకా నీళ్ళు ఏమైనా మిగిలాయేమో....' అంది ముందుకొస్తూ లావుపాటి అమ్మాయి.

కిష్టయ్య కంగారు పడిపోయాడు.

'వద్దండి ....మీరు నొక్కితే గురూగారి పొట్టలోంచి ఏకంగా పేగులేవచ్చేస్తాయ్.....'

'నిన్నూ.....' చెయ్యెత్తింది ఆ అమ్మాయి.

కిష్టయ్య సరోజ వెనకాల నక్కాడు.

'అబ్బ ఏమిటే మీగోల....కాస్త ఉండండి. ఆయన కళ్ళు తెరుస్తున్నారు' అంది సరోజ ముందుకి వంగి రాంబాబు ముఖంలోకి ఆతృతగా చూస్తూ.

అందరూ గుంపుగా రాంబాబు చుట్టూ చేరారు.

రాంబాబు మెల్లగా కళ్ళు తెరిచి రెప్పలు టపటపలాడిస్తూ చూశాడు.

'నేనెక్కడ ఉన్నాను?..... హీనస్వరంతో అన్నాడు.

'స్వర్గలోకంలో....' ఎవరో కొంటెపిల్ల సమాధానం ఇచ్చింది.

రాంబాబు కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. గబుక్కున లేచి కూర్చున్నాడు.

'నేనూ సరోజతో పాటు మీరందరూ కూడా చెర్లో పడిపోయారా?' అందరమ్మాయిలూ గొల్లున నవ్వారు.

'అబ్బ.....ఊరుకోండే....పాపం ఆయన అసలే కన్ఫ్యూజ్ అవుతుంటే.....' అంది సరోజ స్నేహితురాళ్ళని మందలిస్తూ.

రాంబాబు అప్పుడు ఈ లోకంలోకి వచ్చాడు....సిగ్గుతో ముడుచుకుపోయాడు.

కిష్టయ్య రాంబాబు పక్కన చేరాడు.

'గురూగారూ.....ఇప్పుడు మీకెలా ఉందండీ.....?'

'బాగానే ఉందిరా'

'అయ్యో..... మీ బట్టలు పూర్తిగాతడిచిపోయాయ్ గురూగారూ.....'

'చెర్లో దూకితే అలానే తడుస్తాయ్‌లేరా....'

సరోజ తన తలని టవల్‌తో తుడుచుకుని రాంబాబుకి ఇస్తూ అంది 'ముందు మీ తలని తుడుచుకోండి'

రాంబాబు తల తుడుచుకున్నాడు.

'చీరైతే పల్చగా ఉంటుంది కాబట్టి అయిదు నిమిషాల్లో ఆరిపోతుంది....కానీ మీ ఫాంట్

షర్ట్ లైతే ఓపట్టాన ఆరవు....వాటిని పిండి అరబెట్టుకోండి' అంది సరోజ.
'ఎలా వేరే బట్టలు తెచ్చుకోలేదే!!'
'అక్కడ మేము కూర్చోడాని కి పరుచుకున్న దుప్పటి ఇస్తాం.... దాన్ని వంటికి చుట్టుకోండి' అంది లక్ష్మి.
రాంబాబు ఓసారి తనచుట్టూ ఉన్న అమ్మాయిలవంక చూశాడు.
'అబ్బే...... ఎందుకులెండి ..... అవే ఆరిపోతాయ్' అన్నాడు తలొంచుకుని.
'ఫరవాలేదు గురూగారూ.....ఆ దుప్పటి ఒంటిచుట్టూ చుట్టుకోండి. మీ ఫ్యాంటూ షర్టూ చెట్టుకొమ్మల మీద ఆరబెడ్డాం.'
ఎవరు చూడకుండా రాంబాబు కిష్టయ్య తొడని గిల్లేశాడు.
కిష్టయ్య గావుకేక పెట్టాడు.
'హబ్బే.... నేను ఇలానే ఉంటాను..... ఫరవాలేదు..... అవే ఆరిపోతాయ్ లెండి.....' అన్నాడు రాంబాబు.
'అవునవును .....గురూగారు అలానే ఉంటారులెండి.... అవేపోతాయ్...' అన్నాడు సరోజతో, కిష్టయ్య తొడని రుద్దుకుంటూ.
'ఏయ్ ..... కాస్సేపు కుంటాట అడదామే....' అంది ఒకమ్మాయి.
అందరూ సరేనన్నారు.
'నాకు ఆడాలని లేదే....మీరు ఆడుతుండండి .....నేను చూస్తాను' అంది సరోజ.
అందరూ పోలోమని వెళ్ళిపోయారు.
'కాస్త కాఫీ తాగుతారా బావుంటుంది.....' అంది సరోజ రాంబాబుతో.
'అబ్బే .....ఫరవాలేదులెండి....' రాంబాబు తలొంచుకుని సిగ్గుపడ్డాడు.
'వేడివేడి కాఫీ తాగుతే బావుంటుంది..... ఇద్దరం నీళ్ళలో నానేం...నాకు తాగాలని ఉంది .... కిష్టయ్యా.... అదిగో ఆచెట్టుకింద ఫ్లాస్కూ, కప్పులు ఉన్నాయ్..... మన ముగ్గురికి కాఫీ పట్టుకురా....' అంది సరోజ రాంబాబు సమాధానం కోసం చూడకుండా.
కిష్టయ్య వెళ్ళిపోయాడు.

## కృతజ్ఞతలు

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత అన్నాడు రాంబాబు.
'మీ రుణం తీర్చుకోలేనండీ.....'
'ఎందుకూ?' ఆశ్చర్యంగా చూసింది సరోజ.
'మీరు నాప్రాణాల్ని కాపాడారు....' గడ్డిపరక తుంపి నోట్లో పెట్టుకుంటూ అన్నాడు రాంబాబు.
'దీనికి రుణం తీర్చుకోవడాలూ కృతజ్ఞతలూ ఎందుకూ?..... అది నావిద్యుక్తధర్మం.....'

అంది సరోజ గంభీరంగా.

రాంబాబు మళ్ళీ గడ్డిపరక తుంపి నోట్లో పెట్టుకున్నాడు.

'మీరు అలానే అంటారు ..... కానీ మీరు చేసిన పని సామాన్యమైనదా?.....ఒక నిండు ప్రాణాన్ని కాపాడారు....మీ మేలు జన్మలో మర్చిపోలేను.'

మరోగడ్డిపరక తెంపి నోట్లోపెట్టుకున్నాడు.

'తీర్చొద్దులేండి.... ఇంతకీ ఈతరాని మీరు నీళ్ళలో ఎందుకు దూకారు?'

'మిమ్మల్ని రక్షించుదామని....'

'నన్నా?....' ఆశ్చర్యంగా చూసింది సరోజ.

'మీకు ఈత రాదనుకున్నాను ....'

సరోజ పకపకా నవ్వింది. రాంబాబు ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు నాలుగైదు గడ్డిపరకలు తెంపి నోట్లో పెట్టేసుకున్నాడు.

ఆమె నవ్వు ఆగింది. కళ్ళలోని నీరుని పైటతో తుడుచుకుంటూ అడిగింది.

'మరి మీకు ఈతరాదుగా....ఎందుకు దూకారు?'

రాంబాబు ఒక్కక్షణం ఆమెవంక చూసి తల వంచుకున్నాడు.

'ఏమో....మీరు నీళ్ళలో పడ్డారంటే నాకు కగారు పుట్టింది. నాకు ఈతరాదన్న విషయం కూడా మర్చిపోయి చూకేశాను.'

సరోజ అతనివంక సంభ్రమంగా చూసింది.

రాంబాబు మెల్లగా తలెత్తి చూశాడు.

ఇద్దరి చూపులూ కలిశాయ్.

సరోజ తదేకంగా తనని చూడడంతో రాంబాబు హృదయం రెపరెప కొట్టుకుంది. అతని గుండెల్లో వేయి మన్మధబాణాలు ఒక్కసారి నాటుకున్నట్లు అయింది.

రాంబాబు పడిపోయాడు....ఆమె ప్రేమలో పుర్తిగా పడిపోయాడు. తన ప్రేమ విషయం ఆమెకి చెప్పాలని అనుకున్నాడు.

'ఫోటోలు తీసుకోవడానికి వచ్చినప్పుడు చెప్పేస్తాను...' గడ్డిపరక నోట్లో పెట్టుకుంటూ అన్నాడు.

'ఏం చెప్తారు?' అంది ఆశ్చర్యంగా సరోజ.

రాంబాబు నాలుక కొరుక్కుని 'అర్రె...నేను పైకే అనేశానా?' అన్నాడు.

'అవును..... ఏదో ఫోటో తీసుకోడానికి వచ్చినప్పుడు చెప్తానని అన్నారు?'

'అబ్బె....ఏం లేదండీ.....' నాలుగైదు గడ్డిపరకలు తుంపాడు.

'ఫరవాలేదు చెప్పడి!'